చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళా రూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

వీరులకు కాణాచిరా!

'కదనాన శత్రువుల కుత్తుకలన వలీల నుత్తరించిన బలోన్మత్తులేలిన భూమి వీరులకు కాణాచిరా - తెలంగాణ ధీరులకు మొగసాలరా!

అబలయని దేశమును కబళింప తలపడిన పరరాజులకు స్త్రీల పటుశౌర్యమును జూపి రాజ్య తంత్రము నడిపెరా - తెలంగాణ రాణి రుద్రమ దేవిరా!'

కల్పనాతీతమౌ కమనీయ శిల్పమును, వేయి కంబాలలో వెలయించి మించినవి అడుగడుగు శిల్పాలతో తెలంగాణ అందాలు విరజిమ్మెరా

వర్ణ సహజత్వమున వనలతల మఱపించు లాలిత్యరేఖా విలాసాల చిత్రణలు ఆనాటి చిత్రాలురా తెలంగాణ ఆలయపు కుడ్యాలురా

అంటూ ప్రతి పదంలో తెలంగాణ శౌర్య పటిమను, వైభవాన్ని నిక్షిప్తం చేసుకొన్న ఈ గీతం, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావెళ్ల వెంకట రామారావు కలం నుండి జాలువారింది. సాయుధ పోరాట సమయంలో సమరయోధులకు స్ఫూర్తిగా నిలిచి, తెలంగాణ తొలి మాతృగీతంగా గుర్తింపు పొందింది. తొలిదశ తెలంగాణ ఉద్యమం కంటే ముందే ఈ పాట అనేక సభల్లో మార్మోగింది. తెలంగాణ ప్రాంత సాంస్కృతిక ఉద్యమాలకు, ఉద్యమ చైతన్యానికి, ఉద్యమకారుల పోరు షానికి అస్తిత్వగీతంగా నిలిచింది.



నేడు రావెళ్ల వెంకట రామారావు వర్ధంతి

తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతోమంది అజ్ఞాత వీరులు ఉండేవారు. వారిలో కొంతమంది సాహిత్యం లోనూ రాణించారు. వారు తెలంగాణ సాహిత్య చరిత్రలో అజ్ఞాత కవులుగా గుర్తింపు పొందారు. రావెళ్ల వెంకట రామారావు కూడా అలాంటి అజ్ఞాత ఉద్యమకవి. రావెళ్ళవెంకట రామారావు ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, గోకినేపల్లిలో 1927 జనవరి 31న రైతు కుటుంబంలో జన్మించారు. విద్యార్థిదశలోనే 1944లో ఆంధ్ర మహాసభలో చేరిన రావెళ్ల, ఆనాటి రజాకార్ల దమన కాండను, అకృత్యాలను కండ్లారా చూసి చలించి, ఆనాటి సాయుధపోరాటంలో గన్నునూ, పెన్నునూ, ఏకకాలంలో ఆయుధాలుగా వాడుకొంటూ సమరంగాన ముందుకురికి దళ కమాండర్‌గా ఎదిగారు. నాటి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, నవ భారత, స్వతంత్రభారత పత్రికలలో అభ్యుదయ, జానపద శైలిలో రచనలకు శ్రీకారం చుట్టారు.

'నాలుగు శతాబ్దాల నుండి
నవాబు సైతానులు
తెలంగాణ జనరక్తం
జలగల వలె పీల్చినారు

అంటూ నిజాం నియంతృత్వ పరిపాలనపై గళమెత్తిన కవి రావెళ్ల. వీరు మాతృభాషలో చదువుకునే అవకాశం లేకపోయినా వీధిబడిలో సాహిత్య పరిభాషా పాండిత్యానికి పాదులు తవ్వుకున్నారు. ఆ సాహిత్య పునాదుల స్ఫూర్తినుంచే తెలంగాణ అస్తిత్వానికి తొలి చిరునామా గీతమైన **'కదనాన శత్రువుల, కుత్తుకల నవలీల, నుత్తరించిన బలోన్మత్తులేలిన భూమి'** అనే పాట ఉద్భవించింది. 1960లో 'జీవనరాగం' అనే ఖండకావ్యంలో 'మాతృగీతిక' శీర్షికతో వచ్చిన ఈ గేయం గొప్ప చారిత్రాత్మక బాధ్యతను భుజాన వేసుకున్నది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం ప్రశ్నార్థకమైన వేళ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి పాల్వంచలో బీజం పడింది. సింగరేణి బొగ్గు గనుల్లో రాజుకున్న ఆ ఉద్యమ అగ్గికి ఈ 'మాతృగీతిక' ఊపిరులూదింది.

రహస్య జీవితం గడుపుతూ పోరాటం సాగించిన రావెళ్ళ, నిజాం పోలీసులకు పట్టుబడి 1948 అక్టోబర్ నుంచి 1952 డిసెంబర్ వరకు గుల్బర్గా, ఔరంగాబాద్, ఢిల్లీ, ఖమ్మం జైళ్లలో శిక్షను అనుభవించారు. జైళ్లల్లో ఉన్న పరిస్థితులను మార్చాలని 16 రోజులు నిరాహార దీక్ష చేశారు. ఫలితంగా ఖైదీలకు చదువడం, రాయడం లాంటి సౌకర్యాలు లభించాయి. ఢిల్లీ కేంద్ర కారాగారంలో ప్రముఖ కమ్యూనిస్టు నేత ఇంద్రజిత్ గుప్తా, మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి దశరథ్ దేవ్ తదితరులు రావెళ్లకు సహచరులుగా ఉన్నారు.

రహస్య ఉద్యమ సమయంలో నేలకొండపల్లి మండలం, బోదుబండ క్యాంప్‌లో, రాత్రిపూట నిద్రపోయే ముందు రావెళ్ల తన తుపాకిని సెంట్రీకిచ్చి నిద్రకు ఉపక్రమించాడు. అయితే వీరి ఉనికిని తెలుసుకొన్న నిజాం ముష్కర మూకలు రావెళ్ల దళంపై దాడికి ప్రయత్నించాయి. ఇది గమనించిన సెంట్రీ తుపాకిని వదిలేసి పారిపోయాడు. నిజాం మూకలు దాడి ప్రారంభించడంతో మెలుకువ వచ్చిన రావెళ్ల , కాల్పుల్లో ఒక తూటా శరీరం నుంచి దూసుకు పోయినా లెక్క చేయకుండా తన తుపాకితో నలువైపులా కాల్పులు సాగిస్తూ, తన దళంలో చాలామంది ఉన్నట్టు భ్రమ కలిగించాడు. దాంతో ముష్కర మూకలు భయపడి పారిపోయాయి.

బసవరాజు నరేందర్ రావు
99085 16549

ఉద్యమాన్నే ఊపిరిగా భావించిన్న రావెళ్ల వెంకట రామారావు ఉద్యమకారుల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపటం కోసం రక రకాల పేర్లతో ఎన్నో రచనలు చేశారు. జయశ్రీ, పురాతన్, క్రిషిక్, తెలంగాణ్యుడు, ఆర్.వి. ఆర్ లాంటి పేర్లు ఆయన కలం పేర్లలో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గవి. ఆయన ప్రముఖ రచనలు పల్లెభారతి, జీవనరాగం, అనల తల్పం, రాగజ్యోతులు, చైతన్య స్రవంతి గ్రంథాల రూపంలో వెలువడి ఉద్యమ స్ఫూర్తిని రగిలించాయి.

జైలునుంచి విడుదలయ్యాక, రావెళ్ల వెంకట రామారావు తన స్వగ్రామం గోకినేపల్లిలోనే స్థిరపడ్డారు. ఆయనకు భార్య సుగుణమ్మ, నలుగురు కుమారులున్నారు. తర్వాతి కాలంలో తన ఇంటినే ఒక కవితా కుటీరంగా మలుచుకొని అనేక రచనలు చేశారు రావెళ్ల. ఆయన సాహిత్యసేవకు గుర్తింపుగా పలు పురస్కారాలు ఆయనను వరించాయి. అందులో ముఖ్యంగా చెప్పుకోదగ్గవి గురజాడ సాహితీ అవార్డ్, దాశరథి సాహితీ పురస్కారం, జాషువా సాహితీ అవార్డ్ ఉన్నాయి.

ఉద్యమాన్నే ఊపిరిగా మలుచుకొని ప్రజల మనిషిగా జీవించిన రావెళ్ల వెంకట రామారావు 2013 డిసెంబర్ 10న గోకినేపల్లిలోని తన స్వగృహంలో స్వర్గస్థులయ్యారు. వీరులకు కాణాచిరా, 'తెలంగాణ ధీరులకు మొగసాలరా' అంటూ నినదించిన ఆయన గళం ఆ రోజుతో శాశ్వతంగా మూగబోయింది. తల్లడిల్లిన తెలంగాణ తల్లి మూగగా రోదించింది.

అలుపెరుగని పయనం

గమ్మత్తు అసలు
ఈ సృష్టి ధర్మం
ఈ బతుకు పోరాటం
అంతులేని ఆరాటం...!

తల్లి కడుపులో
పిండమై ఉన్నప్పటినుండే
ఒక్కోనెల ఒక్కో భ్రమణం
తల్లీ బిడ్డల పరిక్రమం....!

పుడుతూనే పాలకు
పెరుగుతూ మురిపాలకు
జీవన యాత్రలో
తీరని కోర్కెలకై సాగే పయనం...!

భృతికోసం, ధృతికోసం కృతికోసం
కీర్తి కోసం, మరో కోరిక కోసం
అంతే ఎరుగని మృగతృష్ణ
తృప్తి లేని ఈ కస్తూరి మృగపు అన్వేషణ..!

కాదని తెలిసీ, రాదని తెలిసీ
ఉండనని తెలిసీ, ఆ ఇల్లే చివరని తెలిసీ
ఈ మిథ్యా ఇంటిని విడువలేని
అమాయకపు అలుపెరుగని పయనం..
ఈ జీవితం....

రమాదేవి కులకర్ణి
89856 13123

చెరువు పడ్డింది

చెరువుగట్టు మీద నిలబడి చూడు!
విషాద దృశ్య మొకటి
కండ్లకు కరుకుగా, క్రమక్రమంగా
రూపు గడుతున్నది

కేరింతల అలలు
చిటికెన వేలు పట్టు తప్పి,
అగాధంలోకి జారిపోతున్నయి
గుమిగూడిన నీటి సుడుల్లో
వికలఘోష విహ్వలిస్తున్నది

నునుపు మీనాల చూపులు నిర్జీవమై,
అయోమయావస్థలో కాంతిహీనమైనయి
చెంగోబిల్లల బుడబుంగలు మునిగి
తేలటం మరచిపోయినయి

సహజ శోభల ఎండా వానా
చేష్టలుడిగి, చెరువును
దీనంగా చూస్తున్నయి
తడలు తడలుగా వీస్తూ,

జల తడులతో
ప్రాణగాలి, దుఖాన్ని పంచుకుంటున్నది

పుత్తడి వెల్గుల మత్తడి దుంకిన
చెరువు మౌనముద్ర దాల్చింది
సింగిడి రంగుల బతుకమ్మలతో
నిండిన చెరువు
బతుకు కళ తప్పింది

సూర్యుడు, చంద్రుడు, చుక్కలు, మబ్బులు
చెరువులో ముఖారవిందాన్ని బిడ్డకోలేవు
వరిగొలలు పాలు పోసుకోలేవు
కట్టమైసమ్మ జాతర ఆగమైనట్టే

చెట్టూ చేమా ప్రకృతి
ఆకులు రాలే కాలాల్నే మోస్తాయి గావొచ్చు
తూంగేటు మీద పాలపిట్ట వాలాలె
మళ్ళా చెరువు శతాధిక నవ్వు నవ్వాలె

దాసరాజు రామరాజు

నిశ్శబ్దంలోకి...!

అడుగు ముందుకో వెనక్కో
అర్థం అయ్యేంత వరకు
మనం కానింత సేపు
నిశ్శబ్దంలోకి ప్రవహిద్దాం!

పరిణామాల్ని జీర్ణించుకోలేకపోతే
ప్రయాణాలు ఆగిపోతాయి
ఉత్తాన పతనాలు ఎప్పటికీ
మనల్ని చైతన్య శీలుల్ని చేసేవే!

అనివార్యమైనప్పుడు
ఊపిరి కూడదీసుకోవాలి
అద్దం ముందు నిలబడి
లోపలి దృశ్యాలను పసిగట్టాలి!

ఒక్కో తరానికి
ఒక్కో అనుభవం మిగిలిపోతుంది
చరిత్ర మలుపులో మన పాత్ర ఉంది
మన ఆనవాళ్లే మరో తరానికి పాఠం!

వరుస కరువుల కాలాన్ని
జయించిన వారసత్వం మనది
ఒకప్పుడు వానంటే ఒక కల
ఇప్పుడు నిత్య జల కళ!

ఈ జీవన పోరాటాలు
ఒకనాటితో ముగిసేవి కావు
మన నిత్య సన్నద్ధతే
ప్రగతిశీల చైతన్య సంకేతం!!

కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

జానపదం-మన ప్రాణపదం

తెలుగు నేలమీద అనాదిగా అపూర్వమైన జానపద కళావారసత్వం విరాజిల్లుతూ ఉన్నది. భావి కళల నిర్మాణానికి అవసరమయిన పునాదిలాంటి ఆకారాలను జానపద కళలు అందిస్తాయనటంలోఎటువంటి అతిశయోక్తిలేదు. జానపదులు అంటే పల్లె ప్రజలు. వారు పాడేవి, ఆడేవి వారు కులాల పరంగా రూపొందించుకున్న కళారూపాలే జానపద కళలు.

మన దేశంలో జానపదకళలకు, సంగీతానికి ప్రత్యేక స్థానమున్నది. వేదకాలం నుంచి కాంస్యయుగం, రాతియుగం నాటి యాస, భాష పల్లెప్రజల నోటినుండి శ్రమైక జీవన సౌందర్య చిహ్నాలుగా, వినోద కాలక్షేపాలుగా వివిధ కులాలవారి గీతాలుగా జానపద కళలు, సాహిత్యం రూపొందాయి.

ఈ దేశంలో అనేక మతాలు, భాషలు, ఆచార వ్యవహారాలున్నాయి. ఎక్కువమంది ప్రజ లు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఏ ఒక్క విషయంలోనైనా భాగస్వామ్యం గలిగిన జన సముదాయాలను జానపదులుగా భావిస్తే వాళ్ళకు సంబంధించిన కళలను, సాహిత్యాన్నీ జానపద కళలు, సాహిత్యమనీ, పామర కళలు, సాహిత్యాలనీ ఇలా పలుపేర్లతో పిలిచారు. వారు తమ మానసికోల్లాసం కోసం, సంతోషం కోసం ఉత్సవాలు, జాతరలు, వేడుకల సమయాల్లో ప్రజారంజనకు కొన్ని కళలను సృష్టించుకున్నారు. ఇవే జానపద కళలు. ఇవి ప్రజల సొత్తు కాబట్టే వాళ్ల జీవితాలకు, అలవాట్లకు, ఆచార వ్యవహారాలకు, సుఖదుఃఖాలకు అద్దం పడుతాయి.

జానపద కళలు తెలుగునాట వివిధ రూపాలుగా కనిపిస్తాయి. అనుకరణ నృత్యాలు, బొమ్మలాటలు, వీధినాటకాలు, యక్షగానాలు, వీధిభాగవతాలు, పగటివేషాలు, కలాపాలు, భజనలు, కులగాథాగానాలు, సుద్దులు, జాతర వేషాలు ఇలా ఎన్నో. వీరిలో ఎక్కువమంది విద్య నేర్వకున్నా ప్రత్యేక ఉచ్చారణతో గేయాలు, పద్యాలు, కథలు కంఠస్థం చేసి ఉన్నారు. వీరే మన మౌఖిక సాహిత్య సంరక్షకులు.

తెలుగునాట జానపద కళలు రెండు రకాలు (1) సర్వ జానపద కళలు (2) వృత్తి జానపదకళలు ఎన్నో జానపదకళలు మన తెలుగువారి సొత్తుగా శతాబ్దాలుగా ప్రజలకు వినోదాన్నీ, విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. తెలుగువారి జానపదకళల్లో ఎక్కువగా ఒక ప్రత్యేక కులం వారు వారికి జీవనోపాధినిచ్చే వృత్తిగా స్వీకరించిన కళాకారులు ప్రదర్శించే కళలే! ఒగ్గుకళ, పంబకథ, ఆసాధికథ, బైండ్ల కథ, కొమ్ములకథ, పాండవకథ, రుంజకథ ఇలాంటివి. ఇవికాక కోలాటం, చెక్కభజన, పండరి భజన మొదలయినవి.

తెలుగు జానపదకళలను మరోరకంగా కూడా విభజిస్తారు, ఎవరు, ఎవరికి ప్రదర్శిస్తారు. అనే అంశం ఆధారంగా ఈ విభజన

జరుగుతుంది. వీటినే అనియతాశ్రయ కళారూపాలు, ఆశ్రిత కళారూపాలు అంటారు. అంటే కళాకారులు తాము ఎవరికోసమైనా ప్రదర్శిస్తే ఇది అనియతాశ్రయ కళారూపం.

ఉదాహరణ: పాములవారు, హరిదాసులు, బహురూపుల వారు, పగటి వేషగాళ్ళు, తోలుబొమ్మలాటలు.

ఆశ్రిత జానపద కళలకు ఉదాహరణ: రుంజ కథలు. ఇది ప్రత్యేకంగా విశ్వకర్మ లేదా విశ్వ బ్రాహ్మణులయిన ఐదు దాతృకులాలకు మాత్రమే ప్రదర్శితాలు. ఇతరులు వినవచ్చు. అలాగే కూనపులి వాళ్లు, జెట్టివాళ్లు, గోసంగివాళ్లు. ఇలా 60 కులాలవారికి వారి ఆశ్రితులు మాత్రమే కథ చెప్తారు. ఇది ఆశ్రిత జానపద సాహిత్యం. ఇవి మొదట ఏకవ్యక్తి ప్రదర్శనలుగా ఉండి తర్వాత బహువ్యక్తి ప్రదర్శనలయ్యాయి.

ముగ్గురు చెప్పే కథ పిచ్చుకుంటి కథ. పాండవుల కథ, గొల్ల సుద్దులు, ఒగ్గుకథ మొదలగు కళాకారులు చెప్పే కథను ముందుగా ఒక గుడ్డ మీద చిత్రిస్తారు. నాలుగైదు అడుగుల వెడల్పుగల గుడ్డ 40 నుంచి 50 అడుగుల పొడవున చుడతారు. ఈ చుట్టను సమాంతరంగా ఉన్న రెండు గుంజలపైన అమర్చి పటాన్ని విప్పుతూ ప్రధాన కథకుడు చిత్రించిన బొమ్మలను కర్రతో చూపిస్తూ కథను సంగీత వాయిద్యాల సహాయంతో పాడుతారు. ఇలాంటివి మరికొన్ని తెలుగువారి కళారూపాలు చాకలి పటం, గౌడజెట్టి పటం, డక్కలిపటం, కూనపులి పటం కథలు. ఇవే పరిణామ క్రమంలో తోలుబొమ్మలాటకు తొలిరూపాలుగా చెప్పబడ్డాయి. తర్వాత వీధి నాటక ప్రక్రియ, నాటకం తర్వాతస్థానం పొందింది. ఆహార్యం, ప్రదర్శన వస్తువులు, రంగ సౌకర్యాలు, రంగోద్దీపనలు లేకుండా వీధినాటకాలు ప్రదర్శిస్తారు. తెలంగాణ, సర్కారు ప్రాంతాల్లో ఉన్న బయలాటలు కుప్పం వీధి నాటకాలు మొదలగునవి ఉదాహరణలు.

యక్షగానం:– నాటకానికి దగ్గరగా ఉండే యక్షగాన ప్రదర్శన రంగస్థలంలో, రంగస్థలం లేకుండా కూడా వివిధ పాత్రలతో ప్రదర్శిస్తారు. చిందు యక్షగానం అతి ప్రాచీనమైనది. కూచిపూడి యక్షగానం కూడా ఈ సంప్రదాయానికే చెందింది. తూర్పుభాగవతం, కుప్పం నాటకం, చిరుతల యక్షగానం ప్రత్యేక యక్షగాన కళాసంప్రదాయాలు.

తోలుబొమ్మలాటలు:– ఈ కళా సంప్రదాయాలలో సాధించిన విజ్ఞానానికి ప్రతీకగా తోలుబొమ్మలాటల్ని చెప్పవచ్చు. మానవ పాత్రలను బొమ్మలతో ప్రదర్శింపచేయటం మానవుని కళాతృష్టకు నిదర్శనం. చెక్క బొమ్మలాటలు. ఇవి 12వ శతాబ్దం నుంచి ఉన్నట్టు చారిత్రక ఆధారాలున్నాయి.

తప్పెటగుళ్లు: *ఉత్తరాంధ్రలో ప్రదర్శితమయ్యే 'తప్పెటగుళ్లు కళారూపం' ప్రదర్శనకు అవకాశం ఉన్న సంగీత ప్రధానమైన అంశం. కోలాటం, వివిధరకాల భజన సంప్రదాయాలు, గిరిజన నృత్యాలు కూడా సంగీతంతో ప్రదర్శింపబడే కళారూపాలు.*

డాక్టర్ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి రచించిన తెలుగువారి జానపద కళారూపాలు గ్రంథంలో ఆదిమ మానవుని నుంచి గోల్కొండ రాజుల వరకు జానపద కళారూపాల అభివృద్ధిని జిల్లాల వారీగా వివరించారు. ఇంతకుముందు పేర్కొన్న కళారూపాలు గాక పేరిణినృత్యం, పగటివేషాలు, విప్రవినోదులు, జంగం కథలు, బుడగ జంగాలు, గారడీ విద్యలు, దేవదాసి నృత్యాలు, డప్పుల నృత్యం, భజనలు, బతుకమ్మ ఆటలు, ఫకీరు వేషాలు, గోండు నృత్యం, పెద్దపులి నృత్యం. జముకుల కథలు, గాంగాలమ్మ అశ్వనృత్యం, గంగమ్మ జాతర నృత్యం, జత్తులమారి కత్తులగారడి, వీరశైవుల వీరభద్రవిన్యాసాలు, గొల్లసుద్దులు, ఆరాధనా చిందులు, గిరిజన కళారూపాలు. ఆదిమవాసులనృత్యాలు, గిరిజన సంగీత వాయిద్యాలు, వాయుజన్య శబ్దవాయిద్యాలు. చిరుతల రామాయణం, ఎరుకలసాని ఎరుక. దొమ్మరాటలు, కాటిపాపలవాళ్లు, చెంచుల శ్రీరంగనీతులు, కొలుపుల సంబురాలు, కాటమరాజు కథలు, వీరముష్టివాళ్ళు, బడిపిల్లల పాటలు, ఉరుముల నృత్యాలు, కోలాట సంబరాలు. గంగిరెద్దుల ఆటలు, బైండ్లవాళ్ళు, సాధనాశూరులు ఇలా అనేకం ఉన్నాయి.

'పిట్టలదొర' పగటి వేషం జానపద కళారూపాల్లో చాలా ప్రాచుర్యం పొందింది. మాటల్లో కోటలు దాటు తూ అతిశయోక్తులు కుప్పలుతెప్పలుగా కుమ్మరిస్తూ మాట్లాడే మాటలు వింటున్నవాళ్ళకి నవ్వు పుట్టిస్తాయి. జానపద కళారూపాలు అనాదిగా పల్లె ప్రజల అచ్చమైన ప్రతిభకు నిలువెత్తు నిదర్శనాలు. ఆయా కళారూపాల్ని ప్రదర్శించేటప్పుడు వారి సహజసిద్ధమైన ప్రత్యేక భాష, యాస, ధోరణి శ్రోతల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది.

డాక్టర్.సి. భవానీదేవి
98668 47000

జానపదం ఒక నదీప్రవాహం, ఆకాశమంత విశాలమైనది. సముద్రమంత లోతైనది.. గాలిలా ఆహ్లాదకరమైనది. జానపదం మన మూలధనం. దీన్ని కాపాడుకునే బాధ్యత మనందరిదీ! సాహిత్యం కళలు, ఏదైనా తాతలూ, తండ్రులు ఇచ్చిన ఆస్తి.

అభినవ మొల్ల లక్ష్మీనరసమ్మ

నివాళి

తెలంగాణ మాగాణంలో కవితాధారలు ప్రవహింప చేసిన మొదటితరం కవయిత్రులలో చక్రవర్తుల లక్ష్మీ నరసమ్మ అగ్రగణ్యులు. 80వ దశకంలో అభినవ మొల్లగా పేరుగాంచిన కవి పండితురాలు. తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయే విదుషీమణి.

చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ 1939 జనవరి 3న భద్రాచలంలో జన్మించారు. వీరి తండ్రి పొడిచేటి వీరరాఘవచార్యులు భద్రాచల సీతారాముల ఆలయ ప్రధానార్చకులు. లక్ష్మీ నరసమ్మ తన ఏడేండ్ల వయస్సులోనే గాంధీజీ మరణవార్త విని 'భారత జనకుడు ఇక లేడు గాంధీతాత ఇకలేడు' అంటూ కవితా ప్రస్థానం సాగించారు. అలా ఆమె పలు పద్య, గద్య కావ్యాలు రాశారు. ఆమె రాసిన 'భద్రగిరి' అనే నవలకు మహాకవి దాశరథి పీఠిక రాశారు.

1981లో రామదాసు పద్యకావ్యం రాయగా కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి ఆమె రచనా ప్రావీణ్యతను గుర్తించి 'అభినవ మొల్ల' బిరుదును ప్రదానం చేశారు. ఉమ్మడి రాష్ట్రంతో పాటు, రెండు తెలుగు రాష్ట్రాలు ఆమెకు పలు పురస్కారాలు ఇచ్చి గౌరవించాయి. ప్రపంచ తెలుగు మహాసభల్లో వీరు గౌరవ సత్కారం పొందారు. వీరు రాసిన 'ఆడపిల్ల' కవితను వెన్నెల–3 అనే తెలుగు వాచకంలో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టారు. ఆధ్యాత్మిక చింతనతోనే కాకుండా మను షు లు, ప్రకృతి, పర్యావరణం వంటి ఎన్నో విష యాలపై రచించిన కవిత్వాన్ని 'నీరాజనం' పేరుతో పద్య కవితా సంపుటి వెలువరించారు. ఇవే కాక వీరు అనేక గేయాలు, పాటలు రాశారు. వీరు రాసిన 11 కావ్యాలు సంకలనంగా వెలు వడ్డాయి. రాయలవారు రచించిన ఆముక్త మాల్యద కథను నవలా రూపంలో రచించారు. దీనిపై కాకతీయ యూనివర్సిటీలో ఎం.ఫిల్ కూడా వచ్చింది.

1998లో యునెస్కో సాహితీ స్వర్ణమహిళ, యునెస్కో లిటరసీ ఉమెన్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాలు అందుకున్నారు. 2018లో తెలంగాణ ప్రభుత్వం ఆమెను 'విశిష్ట మహిళా పురస్కారం'తో సత్కరించింది.

సంప్రదాయ కవిత్వంలోనూ ఆధునిక విప్లవ భావాలను రాసిన తెలంగాణ ముద్దుబిడ్డ చక్రవర్తుల లక్ష్మీ నరసమ్మ. అనారోగ్యంతో పోరాడి డిసెంబర్ 7న తుదిశ్వాస విడిచారు. వారి సాహితీ సేవకు అక్షర నీరాజనాలిస్తూ శ్రద్ధాంజలి.

- డాక్టర్ కొండపల్లి నీహారిణి
98663 60082

కలం పిలుపు

కథా సంపుటాలకు ఆహ్వానం

నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కందికొండ రామస్వామి స్మారక పురస్కారం కోసం 2023లో ముద్రితమైన కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నారు. మూడేసి ప్రతులను జనవరి, 31లోగా అబ్దుల్ వహీద్‌ఖాన్, ఇంటి నెం. 15 120/4 /1, రహత్‌నగర్ కాలనీ, నాగర్‌కర్నూల్–509209, తెలంగాణ రాష్ట్రం. వివరాలకు 94927 65358లో సంప్రదించాలి.

-నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక

పుస్తకావిష్కరణ

'పిల్లల పాటల పరిమళం' 'విజ్ఞానం– వికాసం' బాల సాహిత్య గ్రంథాలను డిసెంబర్10న హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్తులో ఆవిష్కరిస్తారు. ఈ సభలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, కె.వి.రమణాచారి, కె.ఐ. వరప్రసాదరెడ్డి, చొక్కాపు వెంకటరమణ, పత్తిపాక మోహన్, గరిపెల్లి అశోక్, జె.చెన్నయ్య తదితరులు పాల్గొంటారు. - తెలంగాణ సారస్వత పరిషత్తు

ప్రసంగం

తెలంగాణ సాహిత్య అకాడమి, భాషా సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో డిసెంబర్ 16 సాయంత్రం రవీంద్రభారతి సమావేశమందిరంలో 'త్రో మై విండో' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ తెలుగు, సంస్కృత పండితులు, నిఘంటు కర్త ఆచార్య రవ్వా శ్రీహరి జీవితం, రచనలపై ఆచార్య కె.యాదగిరి ప్రసంగిస్తారు. డా.ఎస్.రఘు నిర్వహణలో జరిగే కార్యక్రమంలో ఆచార్య సి.మృణాళిని తదితరులు పాల్గొంటారు.

- తెలంగాణ సాహిత్య అకాడమి

బి.ఎన్. శాస్త్రి పురస్కార ప్రదానం

వేద సంస్కృతి పరిషత్, మూసీ మాస పత్రిక సంయుక్త ఆధ్వర్యంలో వైద్యం వేంకటేశ్వరాచార్యులుకు బి.ఎన్.శాస్త్రి పురస్కార ప్రదానం ఈనెల 10 న ఆదివారం సాయంత్రం ఉస్మానియా విశ్వవిద్యాలయం సురభారతి వేదికలో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో శ్రీరంగాచార్య, ఎన్.ముక్తేశ్వర రావు, డి. సూర్యకుమార్‌లతో పాటు లక్ష్మీనారాయణ, వి,వేణు తదితరులు పాల్గొంటారు.

-మూసీ మాస పత్రిక

దీర్ఘకవిత ఆవిష్కరణ

'కణిక సాహిత్య వేదిక' ఆధ్వర్యంలో కవయిత్రి రమాదేవి కులకర్ణి దీర్ఘ కవిత 'చెత్తబండి' పుస్తకావిష్కరణ ఈనెల10 ఆదివారం ఉదయం రవీంద్రభారతి సమావేశమందిరంలో జరుగుతుంది. నాళేశ్వరం శంకరం అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో అయినంపూడి శ్రీలక్ష్మి, ఏనుగు నరసింహారెడ్డి, దాస్యం సేనాధిపతి, బైసాదేవదాసు, జయలక్ష్మి, శ్రీసుధ కొలచన, సారం ప్రవీణ్‌కుమార్, వలిపె సత్యనీలిమ పాల్గొంటారు. -కణిక సాహిత్య వేదిక

నువ్వే ఒక కెరటం..!

సముద్రం అన్నాక
అలలూ ఆటుపోట్లు సహజమే
ఇప్పుడు, మనిషీ మనసుకు కూడా
నిత్య సంఘర్షణ యుద్ధమే

ఋతువులు మారి
కాలం కునుకును మరచి
కదులుతుంది
శబ్దాల మధ్య నిశ్శబ్దం కూడా
తరలి వెళుతుంది
నిట్టూర్పుల మధ్య నీడలు కొన్ని
అబద్ధాలు వల్లె వేస్తాయి

నీకూ, నాకూ పోరు,
ఆధిపత్యం కొత్తదేం కాదు
రోజులన్నీ మాటల మర్మంతో
నడుస్తాయి
ఊసరవెల్లి లెక్కన రంగులు కూడా
కొత్త పాద్దును సృష్టిస్తాయి
హద్దులు లేని ఆశలు అలల్లా నిలిచి
ఉక్కిరిబిక్కిరి చేస్తాయి

మళ్ళీ కొత్తగా ఆశయాన్ని
సరికొత్తగా తిరగతోడాలి
పడిన చోటునే
పరిచయాన్ని ఆవిష్కరించాలి
నవ్విన చిక్కులు మళ్లీ సిగ్గుపడేలా
నువ్వే ఒక కెరటమై లేవాలి
కాలం గమనంపై నువ్వొక
రోల్ మాడల్‌గా నిలవాలి...!

మహబూబ్ బాషా చిల్లెం
95020 00415